క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: మండలంలోని శివపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.30లక్షల నిధులతో సీసీరోడ్లు, పాఠశాల ప్రహరీ పనులు ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు, దుగ్యాల రాంచందర్‌రావు, అమ్ముల ఓదెలు, అమ్ముల రాజు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిరూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలను మండప నిర్వాహకులు ప్రశాంతంగా జరుపుకోవాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. పెద్దపల్లిలో గురువారం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండపాల వద్ద డీజే సౌండ్ బాక్సులు వినియోగించొద్దన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించొద్దని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రిమిలేయర్ వద్దు

యైటింక్లయిన్‌కాలనీ: దేశంలోని ఎస్సీ, ఎస్టీ కులాలకు సంబంధించిన రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న క్రిమిలేయర్ వ్యవస్థను వ్యతిరేకిస్తున్నామని బీమా కోరేగావ్ సేవా సంస్థ అధ్యక్షుడు ఇరికి మహేశ్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్‌భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఎస్‌ఈ సెంట్రల్ స్కూల్ పాఠ్యాంశాల్లో బీజేపీ ప్రభుత్వం కాషాయీకరణకు సంబంధించిన అంశాలు ముద్రించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వెంటనే పాఠ్యపుస్తకాల్లో సవరణ చేయాలని కోరారు. శ్రీనివాస్, సాగర్, వెంకటేశ్, విఘ్నేష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళి



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: బషీర్‌బాగ్ అమరవీరులకు గురువారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో నివాళి అర్పించారు. అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు కె.కనకరాజ్, గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, తాళ్లపెల్లి మల్లయ్య, మర్కాపురి సూర్య, మడికొండ ఓదెమ్మ, తొడుపునూరి రమేశ్‌కుమార్, ఆసాల రమ, రేణుకుంట్ల ప్రీతం పాల్గొన్నారు.

మేడిపల్లి సెంటర్‌లో..

జ్యోతినగర్: విద్యుత్ ఉద్యమ అమరవీరులకు సీపీఎం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో గురువారం సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటాలకు నివాళి అర్పించారు. నాయకులు ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, సునీత, రవీందర్, సాంబయ్య, పురుషోత్తం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

మంథనిరూరల్: మండలంలోని సూరయ్యపల్లిలో వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుల సూచనల మేరకు రూ.లక్ష వ్యయంతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ఎలక్ట్రిసిటీ సలహా మండలి సభ్యులు శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆకుల కిరణ్, మాజీ సర్పంచ్ కరుణ కృష్ణ, మాజీ ఎంపీటీసీ భీముని వెంకటస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగాం నర్సింగరావు, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి ఆరెల్లి కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి సుభాష్‌నగర్‌లో..



గోదావరిఖని: పూజల్లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్,



గోదావరిఖని: పూజల్లో పాల్గొన్న జీఎం లలిత్‌కుమార్



కమాన్‌పూర్: పూజలు చేస్తున్న భక్తులు



ఓదెల: పొత్కపల్లిలో..



యైటింక్లయిన్‌కాలనీ: పూజల్లో ఆర్జీ-2 జీఎం వెంకటయ్య

కొలువుదీరిన గణపయ్య

వినాయకచవితి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా బుధవారం ఊరూరా.. వాడవాడలా కొలువుదీరిన బొజ్జగణపయ్యలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వినాయకుడికి ఇష్టమైన మారేడు పత్రి, ఎలుక పత్రితో పాటు 21 రకాల ఆకులతో పూజలు చేసి, పిండి వంటలతో, కంకులు, ఉండ్రాళ్లు, పాయసం నైవేద్యంగా సమర్పించారు. గురువారం భజన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జూలపల్లిలో..



రామగిరి: కల్వచర్ల అంబేడ్కర్ కాలనీలో..



ఎలిగేడు: ధూళికట్టలో..



సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లిలో..



సుల్తానాబాద్: శివాలయంలో..

పందులను నగరానికి దూరంగా తరలించండి



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ: ప్రజారోగ్యం దృష్ట్యా పందులను నగరానికి దూరంగా తరలించాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ పందుల పెంపకందారులను కోరారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పందుల పెంపకందారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. నగరంలో పందుల పెంపకం వదిలేస్తే జీవన భృతికి ఇబ్బందికి కలగకుండా కుటుంబంలో ఒకరికి, ఏదేని ఒక రంగంలో శిక్షణ ఇచ్చి నైపుణ్యం పెంపొందించడంతోపాటు ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. వెంటనే పందులను జనావాసాల నుంచి తరలించాలని ఆదేశించారు. నగరపాలక డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీరామన్, పశు సంవర్ధకశాఖ రామగుండం అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్, నాగభూషణం, ప్రజారోగ్య విభాగం సీనియర్ అసిస్టెంట్ శ్రీ పాల్, పందుల పెంపకందారుల సంఘం ప్రతినిధులు నరేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలందించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే వారికి మెరుగైన సేవలందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య కోరారు. జిల్లా ఆసుపత్రిని గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. పేషెంట్లతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేసి ఇక్కడే సేవలందేలా చూడాలని సూపరింటెండెంట్ శ్రీధర్‌ను కోరారు. న్యూరో, గుండె సంబంధిత వైద్యులను కూడా అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. కొత్తగా చేపట్టిన ఆసుపత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కోరారు. నాయకులు సారయ్య, కల్లెపల్లి అశోక్, శ్రావణ్, నవీన్, సూరజ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• కబ్జాకు గురైన సింగరేణి భూమిని రక్షించాలి

గోదావరిఖని: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పక్కనే ఉన్న రూ.కోట్ల విలువచేసే సింగరేణి భూమి కబ్జాకు గురైందని బీజేపీ నాయకులు పిడుగు కృష్ణ ఒక ప్రకటనలో ఆరోపించారు. మార్కండేయకాలనీ నడిబొడ్డున సింగరేణి భూమి కబ్జాదారుల చేతిలో పడి దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. అప్పటి సింగరేణి అధికారులు, రెవెన్యూ అధికారులు చేతివాటంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. సింగరేణి యాజమాన్యం, రెవెన్యూ అధికారులు సింగరేణి భూమిని కాపాడాలని కోరారు.

• మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

ముత్తారం: మండలంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేసరి సంతోష్ తెలిపారు. విద్యార్థులు 30లోపు ధృవీకరణ పత్రాలతో మోడల్ స్కూల్‌కు రావాలని సూచించారు.

• అడిషనల్ కమిషనర్ బాధ్యతలు స్వీకరణ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా ఎ.మారుతిప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఈనెల 20న రామగుండం నగరపాలక సంస్థకు బదిలీ చేసింది. కాగా నగరపాలక సంస్థ సెక్రటరీగా బదిలీపై వచ్చిన ఎం.ఉమామహేశ్వర్‌రావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పి.వెంకటేశ్వర్లు కూడా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.

• రైతులకు యూరియా పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల సింగిల్‌విండో, పుట్నూర్ సీఎంఎస్ కేంద్రం ద్వారా రైతులకు 22 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ వెల్లడించారు. గత వానాకాలంతో పోలిస్తే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు దాదాపు 200 మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం మండలంలో 5 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.

• మానేరు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్‌రూరల్: కరీంగనర్ ఎల్ఎండీ లోయర్ మానేరు డ్యాం గేట్లు తెరుస్తారని, ఈ సందర్భంగా మానేరు ప్రాంతాల పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్‌కుమార్ ప్రజలకు సూచించారు. మండలంలోని నీరుకుళ్ల సమీపంలో మానేరు వాగును గురువారం ఆయన పరిశీలించారు. పశువులు, గొర్రెల కాపరులు, వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

• సర్కార్ దవాఖానకు.. మాతా శిశుఆరోగ్య కేంద్రం

మంథని: గోదావరి ఉధృతి కారణంగా మంథని సమీపంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక వైద్యశాలకు మార్చుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్ గురువారం తెలిపారు.

• పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత

ఎలిగేడు: ధూళికట్ట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థి, ధూళికట్ట వాసి సత్యనారాయణరావు పదో తరగతి టాపర్స్‌కు నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ ఏడాది పదిలో టాపర్ మారం రాంచరణ్(509)మార్కులు, ఎం.అక్షిత(495)మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు అందజేశారు. అలాగే పాఠశాలలో బోర్‌వాటర్ తాగడానికి తన తండ్రి బుద్ధినేని వెంకట్రావు జ్ఞాపకార్థం ప్యూరిఫైర్ కోసం రూ.21వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

• ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

రామగుండం: రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సత్వరమే నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అంతర్గాం మండల కేంద్రంలో గురువారం ఉద్యమకారులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆదేశించాలని కోరుతూ ఆ పార్టీ అధినేత, ఎంపీ రాహుల్‌గాంధీకి పోస్టుకార్డులు పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇస్తామని పేర్కొన్నప్పటికీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఫోరం మండల అధ్యక్షుడు గోసిక తిరుపతి, ఒల్లెపు సారయ్య, రాజ్‌కుమార్, సురేశ్, మల్లేశ్, గట్ల రవీందర్‌రెడ్డి, రవీందర్, కుమార్ పాల్గొన్నారు.

• ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేశ్ సాయి పట్టుకున్నారు. మంథని మండలం చిల్లపల్లికి చెందిన కుంభం వంశీ ఖమ్మంపల్లి మానేరు నుంచి మంథని మండలానికి ఇసుక అక్రమంగా తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు ట్రాక్టర్ పట్టుకున్నట్లు ఆర్ఐ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

• ఉపాధ్యాయుల వినతి

కాల్వశ్రీరాంపూర్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గురువారం మండలంలోని తారుపల్లిలో ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకుడు సత్యప్రకాశ్‌రావు వినాయక విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే 317 జీవో తొలగించేలా చూడాలని వినాయకుడిని ప్రార్థించారు.

బీఆర్‌ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

గోదావరిఖని: స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితా రూపకల్పనలో ప్రభుత్వం అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికల సంఘం ఇచ్చే ఓటరు జాబితా ముసాయిదాను గ్రామస్థాయిలోనే పరిశీలించి అభ్యంతరాలను అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లాలన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక లీగల్ సెల్ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 29న జిల్లా స్థాయిలో, 30న మండలస్థాయిలో ఎన్నికల సంఘం అధికారులతో రాజకీయ పార్టీల సమావేశాలు జరుగుతాయన్నారు.

సమస్యలపై వినాయకుడికి వినతి

పెద్దపల్లిరూరల్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల కాక, విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారని, ఈ విషయం పాలకులకు చెప్పాలంటూ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, బుధవారం వినాయకుడి విగ్రహానికి వినతిపత్రం అందించారు. పై చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులంతా మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. నాయకులు అజయ్, అరవింద్, రాజు ఉన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ



ధర్మారం: మండల కేంద్రంలోని సాయిమణికంఠ హైస్కూల్ విద్యార్థులు తయారుచేసిన మట్టి వినాయకులను బుధవారం పాఠశాల కరస్పాండెంట్ జైన సురేశ్‌కుమార్ భక్తులకు పంపిణీ చేశారు. విద్యార్థులు తయారు చేసిన దాదాపు 300 మట్టి వినాయకులను స్థానిక అంబేడ్కర్ చౌరస్తాకు తీసుకొచ్చి పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాత బాలాజీ, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెర్మినల్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకోండి

రామగిరి: ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో వివిధ గనులు, విభాగాల్లో విధులు నిర్వహించి మెడికల్ ఇన్వాలిడేషన్, డిస్మిస్, ఉద్యోగ విరమణ, మృతి చెందిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తమ టెర్మినల్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంపీఎఫ్, గ్రాట్యుటీ తదితర ప్రయోజనాల కోసం వారి గనుల సంక్షేమ అధికారులను సెప్టెంబర్ 15లోపు సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కంపెనీ నియమ నిబంధనల ప్రకారం వారికి రావాల్సిన ప్రయోజనాలు పొందాలని సూచించారు.

ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజం



సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి: ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు ఇసంపల్లి రమేశ్ అన్నారు. ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో ఆర్జీ-3లో విధులు నిర్వహించి బదిలీపై ఆర్జీ-1, 2కు జమేదారులుగా వెళ్తున్న పోగుల అర్జున్, తోట రాజేశంను, అలాగే ఆర్జీ-3 ఏరియాకు బదిలీపై వచ్చిన కందుల సదయ్య, విక్టర్‌కు బుధవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. నూతనంగా ఆర్జీ- 3, ఏపీఏ డివిజన్లకు జమేదారుగా పదోన్నతి పొంది వచ్చిన ఇరువురికి స్వాగతం పలికారు. ఆర్జీ-3 ఎస్అండ్‌పీసీ కార్యదర్శి దేవరకొండ తిరుపతి, పొన్నం సదయ్య, పలకపాటి రామయ్య, పలిగిరి హరికిరణ్, యాకూబ్ జానీ, మామిడాల లక్ష్మీరాజం, రాజగోపాల్, నాగరాజు, ధర్మరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణివ్యాప్తంగా అన్ని ఏరియాల్లో గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయా గనుల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్జీ-1 ఏరియాలో జరిగిన కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి శంకర్, మాదాసి రామ్మూర్తి, పర్లపెల్లి రవి, ప్రదీప్, మురళి, ఉప్పులేటి తిరుపతి, దూట శేషగిరి, మీస రాజు, దిడ్డి లక్ష్మణ్, కళాధర్‌రెడ్డి, మహేశ్, గోపి, పోలాడి శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, అభిషేక్, వాసర్ల జోసెఫ్ పాల్గొన్నారు. ఆర్జీ-2 ఏరియా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఏరియాలోని అన్నిగనులపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయా గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు చెరుకు ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, ఐ.సత్యం, చెల్పూరి సతీశ్, మామిడి తిరుపతి, రవితేజ, హరిప్రసాద్, బొడ్డు రమేశ్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 ఏరియాలో మంత్లీరేటెడ్ ఉద్యోగులకు గురువారం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో 343 క్వార్టర్లకు గాను 148మంది ఉద్యోగులు హాజరయ్యారు. కాగా 17మందికి అర్హతను బట్టి క్వార్టర్లు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అధికారులు ఫిరోజ్‌ఖాన్, రవీందర్, వూట్ల దేవాచారి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న జీఎంలు

రామగిరి: మట్టి వినాయక విగ్రహాలను పూజిస్తూ ప్రతీఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకరరావు, కొలిపాక నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడాప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ పరిసర గ్రామాల ప్రజల కోసం ఎన్నో సామాజిక, పర్యావరణ హిత కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ఏపీఏ జీఎం సతీమణి వెంకటలక్ష్మి, పర్యావరణ అధికారి కిషన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీవైపీఎం సునీల్ ప్రసాద్, సీనియర్ పీవో పి.రాజేశం పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం



రైతులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

ధర్మారం: రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో గోడౌన్ వద్ద గురువారం సాయంత్రం యూరియా కోసం వేచి చూస్తున్న రైతులను చూసి తన వాహనం ఆపి రైతులతో మాట్లాడారు. తమకు యూరియా అందడం లేదని ఈశ్వర్‌తో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా రైతులకు న్యాయం చేయలేకపోతున్నారన్నారు. రైతులు సకాలంలో యూరియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మండలంలోని వివిధ గ్రామాల్లో పలువురు అనారోగ్యంలో మరణించారు. వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. మండలంలోని మల్లాపూర్ మాజీ సర్పంచు గంధం వరలక్ష్మి భర్త కరెంట్ షాక్‌తో మరణించారు. కాగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నర్సింగాపూర్, పత్తిపాక, దొంగతుర్తి, నర్సింహులపల్లి గ్రామాల్లో బాధిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి పరామర్శించారు. మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ధర్మారం, వెల్గటూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఏలేటి కిష్టారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు ఆవుల శ్రీనివాస్, వేణుగోపాల్, చొప్పరి చంద్రయ్య, దాడి సదయ్య, కొమురయ్య, నారాయణ పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఓటరు జాబితా ప్రదర్శన



బ్రాహ్మణపల్లి పంచాయతీ ఆఫీసు వద్ద ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న కార్యదర్శి, తదితరులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గ్రామీణ ప్రాంత ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలోని 14మండలాలు, 263 పంచాయతీల్లో పల్లె ఓటర్లు 4,04,209 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కన్న మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు తేలింది. మహిళా ఓటర్లు 2,05,451 మంది ఉండగా, పురుష ఓటర్లు 1,98,744 మంది ఉన్నారని అధికారవర్గాలు తెలిపాయి. మరో 14మంది ఇతరులు ఉన్నట్లు పేర్కొన్నారు.

పెద్దపల్లిలో అధికం.. అంతర్గాంలో అత్యల్పం

జిల్లా కేంద్రమైన పెద్దపల్లి మండలంలో ఓటర్ల సంఖ్య అత్యధికంగా 51,014 ఉంది. అత్యల్పంగా అంతర్గాం మండలంలో 17,930 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. అలాగే ధర్మారం మండలంలో 43,697 మంది ఓటర్లుండగా, ఎలిగేడులో 18,570, జూలపల్లి 24,163, కమాన్‌పూర్ 20,145, మంథని 34,973, ముత్తారం (మంథని) 23,197, ఓదెల 35,807, పాలకుర్తి 28,118, రామగిరి 32,574, శ్రీరాంపూర్ 34,821, సుల్తానాబాద్ మండలంలో 39,200 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని ఆయా పంచాయతీలను 2,432 వార్డులుగా విభజించారు. ప్రతి వార్డుకో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదకరంగా బరాజ్ కరకట్ట

మంథనిరూరల్: అధికారుల నిర్లక్ష్యంతోనే పార్వతి బరాజ్ కరకట్ట ప్రమాదకరంగా మారిందని బీజేపీ మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్ ఆరోపించారు. మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతి బరాజ్ కరకట్టను గురువారం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా కడెం, ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో ఎగువ నుంచి భారీగా వరదనీరు పార్వతి బరాజ్‌లోకి చేరి కరకట్ట కోతకు గురవుతోందన్నారు. ప్రమాదవశాత్తు కరకట్ట తెగితే సమీపంలోని బెస్తపల్లి, సిరిపురం, గుంజపడుగు, ఉప్పట్ల, పోతారం గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందన్నారు. అధికారులు స్పందించి కరకట్టకు మరమ్మతు చేయించి ప్రమాదం జరగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తోట మధుకర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్కా సదానందం, మండల కార్యదర్శి బూడిద విష్ణు, నాయకులు గుమ్మడి శ్రీనివాస్, కొమురయ్య, మల్లేశ్, సాదుల తిరుపతి పాల్గొన్నారు.

కార్మిక హామీల అమలులో యూనియన్లు విఫలం

రామగిరి: కార్మిక హామీల అమలులో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని టీబీజీకేఎస్ ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆరోపించారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్జీ-3 ఏరియాలోని వివిధ గనుల్లో, ఏపీఏ గనిలో గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం మేనేజర్లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లాభాల వాటా 35శాతం చెల్లించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కారించాలన్న పలు డిమాండ్లతో టీబీజీకేఎస్ దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయా జీఎంలకు వినతిపత్రాలు ఇవ్వడం, సెప్టెంబర్ 2న కొత్తగూడెంలో ధర్నా నిర్వహించి సమస్యల సాధనకు కార్మికుల పక్షాన పోరాటం చేయనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు వేముల రవిశంకర్, దేవ శ్రీనివాస్, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఈసంపల్లి రమేశ్, పొన్నం సదానందం, దాసరి మల్లేశ్, గండి శ్రీనివాస్‌గౌడ్, పోతరాజు శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.